నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్ : హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.
- శ్రీలా ఫీడర్ పరిధిలో.. శ్రీలా విల్లాస్, వాటర్ వర్క్స్, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, కల్వరి చర్చి ఏరియాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

ఎన్‌సీఈటీ ద్వారా 4 ఏళ్ల ఐటీఈపీలో ప్రవేశాలు

'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొ.వనజ

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు ఏర్పాట్లు చేశామని 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ బుధవారం తెలిపారు. విశ్వవిద్యాలయంలో బీఏ బీఈడీ (సెకండరీ), బీఎస్సీ బీఈడీ(సెకండరీ), బీకామ్ బీఈడీ(సెకండరీ) నాలుగు ఏళ్ళ ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(ఐటీఈపీ)లలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ) ఆధారంగా ప్రవేశాలుంటాయని వివరించారు. ఈ కోర్సుల్లో ఒక్కొక్క దానిలో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు మార్చి 16వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలు, ప్రాస్పెక్టస్ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలను పూరించే ముందు 'మనూ' ఐటీఈపీ ప్రాస్పెక్టస్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23120600 (ఎక్స్‌టెన్షన్-1801)లో సంప్రదించాలని ఆమె కోరారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



షాహిదాబేగంకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరమని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌కు చెందిన షాహిదా బేగంకి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2 లక్షలు చెక్కును బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎంపీ ఇబ్రహీం, మహమ్మద్ బేగ్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ ఆరో ఫేజ్‌లోని విజయదుర్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పంచముఖ ఆంజనేయస్వామి, శ్రీ దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంను హనుమద్దీక్ష పీఠాధిపతులు దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరయ్యారు. హోమం, పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు విజయ్‌కుమార్‌చౌదరి, రామారావు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ప్రవీణ్ అప్పారావు, శివ చౌదరి, నళినీకాంత్, రమణ, రజిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ ముకుంద్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్, నియోజకవర్గ ఈఆర్‌ఓ ముకుంద్ రెడ్డి మాట్లాడుతూ పోలింగ్‌బూత్‌ల వారీగా ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయా ప్రాంతాలలో మరణించిన ఓటర్ల డెత్ సర్టిఫికెట్లను అందజేయాలని కోరారు. సర్టిఫికెట్స్‌ను పరిశీలించి ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 7,67,008 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుష ఓటర్లు 4,04,569, మహిళా ఓటర్లు 3,62, 294, ఇతరులు 145 మంది ఉన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రేమ్‌కుమార్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు దాటాలంటే.. కష్టాలు

ఓవైపు వారాంతపు సంతలు ,మరోవైపు పైప్‌లైన్.. రోడ్డు మరమ్మతులు

చందానగర్ : ఒకవైపు పైప్‌లైన్ పనులు, రోడ్డు మరమ్మతులు.. మరోవైపు సంతల నిర్వహణ.. దీంతో స్థానికులతో పాటు పలు కాలనీలవాసులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. హఫీజ్‌పేట్‌లోని మైత్రీనగర్, ప్రకాష్‌నగర్ వద్ద మంజీరా పైప్‌లైన్ రోడ్డుపై సంత వలన వాహనదారులు రాకపోకలకు అవస్థపడుతున్నారు. మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్‌లోని వివిధ ప్రాంతాలలో కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలలో వారానికి ఒక రోజు ప్రత్యేకంగా సంతలు నిర్వహిస్తున్నారు. కొన్ని కాలనీలలో ప్రధానరోడ్లపై సంతలు నిర్వహించడం వలన ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. రాష్ట్ర ప్రభుత్వం రైతుబజారులు ఏర్పాటు చేసినప్పటికి నగరంలో పెరుగుతున్న ప్రజానీకానికి ఇవి సరిపోవడం లేదు. దీంతో వారాంతపు సంతలకు ఆదరణ పెరిగింది. గంగారం, హుడాకాలనీ, ఆర్టీసీ కాలనీ, మదీనాగూడ గ్రామంలో, మైత్రినగర్ మంజీరా రోడ్డులో, ఆల్విన్ కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని సాయిబాబా ఆలయం వద్ద, మాతృశ్రీనగర్, గోకుల్‌ప్లాట్స్‌లో పెద్ద చర్చి వద్ద సంతలు నిర్వహిస్తున్నారు. రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. సంత రోజు రోడ్డుపై నడవడానికి కూడా వీలులేకుండా ఉంటుంది.



వాహనదారుల ఇబ్బందులు

- మిగిలిపోయిన కూరగాయలను విక్రయదారులు రోడ్లపైనే పారబోస్తున్నారు. సంత నిర్వహించిన మరుసటి రోజు రోడ్డుపైన చెత్త చెదారం పేరుకుపోతుంది.
- సంతను రోడ్లపై కాకుండా కాలనీలలోని ఖాళీ స్థలాలలో,అంతర్గత రోడ్లపై నిర్వహించాలి
- సంత ఉన్న రోజు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా మరో మార్గంలో వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి
- మిగిలిన కూరగాయలు వేయడానికి చెత్త డబ్బాలను అందుబాటులో ఉంచాలి.



ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మోడల్ మార్కెట్ల కోసం నూతన భవనాలు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లపై ఏర్పాటు చేస్తున్న వారాంతపు సంతను మరో చోటకు మార్చాలి. మంజీరా రోడ్డులో కాకుండా కాలనీలోని అంతర్గత రోడ్లపై సంత నిర్వహించాలి.

- అశోక్, మదీనాగూడ

ఖాళీ స్థలాల్లో నిర్వహించాలి



వారాంతపు సంతలు రోడ్లపై కాకుండా కాలనీలలోని ఖాళీ స్థలాలలో లేదా ప్రభుత్వ స్థలంలో కానీ ఏర్పాటు చేస్తే వాహనదారులకు ఇబ్బందులు ఉండవు. అలాగే మిగిలిపోయిన కూరగాయలు వేయడానికి చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలి.

- అంజి, మదీనాగూడ



ఎఫ్‌డీడీఐ-సీఐపీఈటీ ఎంఓయూ



కార్యక్రమంలో పాల్గొన్న ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీఐపీఈటీ) హైదరాబాద్ మధ్య బుధవారం ఓ ఒప్పందం కుదిరింది. భారతదేశ పాదరక్షల పరిశ్రమ ప్రపంచవ్యాప్తంగా పోటీ ఇచ్చేలా పనిచేస్తున్నామని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తేజ్‌లోహిత్‌రెడ్డి, సీఐపీఈటీ హైదరాబాద్ ప్రిన్సిపల్ డైరెక్టర్ అండ్ హెడ్ పి.కె.సాహూ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫుట్‌వేర్, పాలిమర్ టెక్నాలజీలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఎఫ్‌డీడీఐ-సీఐపీఈటీ మధ్య ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, అధునాతన తయారీ సాంకేతికతలలో సహకార ప్రయత్నాలు విజయవంతం చేసేలా చూస్తామన్నారు. సీఐపీఈటీ హైదరాబాద్ ప్రిన్సిపల్ డైరెక్టర్ అండ్ హెడ్ పి.కె. సాహూ మాట్లాడుతూ పాదరక్షలలో నైపుణ్యాల అభివృద్ధి, స్వల్పకాలిక కోర్సులు, డిజైన్ టెక్నాలజీ మరింత మెరుగ్గా నిర్వహించేలా సమష్టి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ హైదరాబాద్, సీఐపీఈటీ హైదరాబాద్ సంస్థల ఫ్యాకల్టీ, అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి నిధులు కేటాయించాలి



ర్యాలీగా వస్తున్న సభ్యులు

మియాపూర్: శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో మహిళా సంక్షేమానికి 20శాతం నిధులు కేటాయించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి తాండ్ర కళావతి డిమాండ్ చేశారు. మియాపూర్‌లోని ఓంకార్ నగర్ కాలనీలో ఏఐఎఫ్‌డీడబ్ల్యూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్త్రీల రక్షణ , భద్రతలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని అన్నారు. మహిళల రక్షణ విషయంలో ప్రశ్నించడం, చైతన్యం కల్పించడం మన బాధ్యతన్నారు. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శివాణి, అనిత, విమల, లలిత, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్ : చందానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే గాంధీ బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. నాయకులు గౌతమ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, సర్కిల్ 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, ప్రాజెక్టు అధికారి ఉషారాణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, నాయకులు రఘునాథ్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మియాపూర్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో హారిక టవర్స్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ సభ్యులు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాలనీ,అపార్ట్‌మెంట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు సుప్రజ, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు మూర్తి, శివ, నరేంద్ర, నవీన్, సాయి కిరణ్, సీతారామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలతో అవగాహన

గచ్చిబౌలి: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చోటు చేసుకునే ప్రమాదాలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌రూట్‌లో వెళ్లడం, లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేయడం, మైనర్లు వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, అతి వేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుని మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఉల్లంఘనకు పాల్పడి మరణానికి కారణమైతే వారిపై బీఎన్ఎస్ 105 సెక్షన్ కింద కేసు నమోదు చేస్తారని, 10 ఏళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉందని పోస్టర్‌లో వివరించారు. బస్టాప్‌లు, ఆటోస్టాండ్‌లు, ప్రధాన కూడళ్లు, హోటళ్లు, పెట్రోల్ బంక్‌లు, పార్కులు, క్రీడా మైదానాలు తదితర ప్రాంతాలలో, అలాగే గచ్చిబౌలి ఏరియాలో 200చోట్ల పోస్టర్‌లు అంటించారు.



జంక్షన్ల విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి



హెచ్‌సీయూ డిపో జంక్షన్‌ను పరిశీలిస్తున్న సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి

గచ్చిబౌలి: జంక్షన్ల విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి అధికారులను ఆదేశించారు. ఐటీ కారిడార్‌లో జంక్షన్లు, రోడ్ల విస్తరణ పనులను ఆయా విభాగాల అధికారులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. మసీద్‌బండలోని అంబేడ్కర్ సర్కిల్, హెచ్‌సీయూ బస్ డిపో జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్ల విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. అంజయ్యనగర్‌లో విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని అలాగే గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాలకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి అడ్డంకులను తొలగించాలని సూచించారు. మాదాపూర్‌లోని ఎన్ఐఏ రోడ్డు విస్తరణలో భాగంగా చెట్ల ట్రాన్స్‌ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. గచ్చిబౌలి జంక్షన్‌లోని ఔటర్ ఎంట్రెన్స్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ గజారావు భూపాల్, డీసీపీ సాయి మనోహర్, శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఎస్ఈ శంకర్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

చందానగర్ : వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంను బుధవారం మియాపూర్‌లో పాత పోలీస్‌స్టేషన్ కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు. సోషల్ మీడియా యాక్టివిస్ట్ తన్నీరు నాగరాజు, శివకుమార్‌ల ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు, అరటి పండ్లు, బటర్ మిల్క్ పంచిపెట్టారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, కొండారెడ్డి, బాషా, మాధవరెడ్డి, శివారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

16న 5కే రన్



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ తులసివనంలోని అవని ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 16వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు 5కే రన్ నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ శిరీష సత్తూర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజిత గౌడ్‌లను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5కే రన్‌లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రానిక్ కిడ్నీ వ్యాధిపై అవగాహన



నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యబృందం

- దేశంలో 10 లక్షల మందిలో 800 మంది కిడ్నీ వ్యాధి బాధితులే
- స్టార్ ఆస్పత్రుల సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ గండె శ్రీధర్


రాయదుర్గం: భారతదేశంలో పది లక్షల మందిలో సుమారు 800 మంది తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని స్టార్ ఆస్పత్రుల సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ గండె శ్రీధర్ అన్నారు. బుధవారం నానక్‌రాంగూడలోని స్టార్ ఆస్పత్రిలో క్రానిక్ కిడ్నీ వ్యాధిపై అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జనాభాలో దాదాపు 8,800 మంది తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ పరిస్థితిని ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇటీవల ఈ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని, చిన్న వయస్సులోనే దీని బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతియేటా హైదరాబాద్‌లో సుమారు 1,200 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని, ఇది 12 నుంచి 16 శాతం వరకు వృద్ధి చెందుతోందన్నారు. యూరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ గుంటపల్లి చిన్న మాలకొండయ్య మాట్లాడుతూ క్రానిక్ కిడ్నీ వ్యాధుల పెరుగుదలకు ప్రధానంగా మధుమేహం, రక్తపోటు, అధిక బరువు వంటివి కారణాలని అన్నారు. హైదరాబాద్‌వాసులు కిడ్నీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో నెఫ్రాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ జ్యోత్స్న, ఇతర వైద్య బృందం పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు ముమ్మరం

- బస్టాండ్ నుంచి నర్కూడ శివారు వరకు విస్తరణ
- నాలుగు వరుసలుగా రహదారి నిర్మాణం
- తీరనున్న వాహనదారుల కష్టాలు



నర్కూడ శివారులో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు



కాచారం వద్ద ఎంటేరువాగుపై ఉన్న వంతెన పైనుంచి పడిన ట్రాలీ (ఫైల్)

శంషాబాద్ రూరల్: రహదారి విస్తరణ పనుల్లో వేగం పుంజుకుంది. శంషాబాద్-షాబాద్ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. బస్టాండ్ నుంచి నర్కూడ శివారు వరకు ఈ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం రాళ్లగూడ-నర్కూడ మధ్యలో పనులు సాగుతున్నాయి. రెండు శాఖల ఆధ్వర్యంలో సుమారు ఆరు కిలోమీటర్ల వరకు విస్తరణ పనులు చేపట్టారు.

వాహనదారులకు ఊరట...

రహదారి విస్తరణ పనులు పూర్తయితే వాహనదారులకు ఊరట కలగనుంది. బస్టాండ్ నుంచి నర్కూడ వరకు వాహనాల రాకపోకలు భారీగా పెరిగిపోయాయి. షాబాద్ మండలంలోని హైతాబాద్ వద్ద పారిశ్రామికవాడ ఏర్పాటుతో ఈ మార్గంలో సరుకు రవాణా వాహనాల రాకపోకలతో పాటు ఇతర వాహనాల సంఖ్య పెరిగిపోయింది. రెండు వరసలుగా ఉన్న రహదారితో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ పెరుగుతోంది. ఈ మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య నుంచి వాహనదారులకు ఉపశమనం కలగనుంది.

రెండు శాఖల ఆధ్వర్యంలో...

రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ రహదారి విస్తరణ కోసం ఆర్‌అండ్‌బీ, హెచ్‌ఆర్‌డీసీఎల్ శాఖల నుంచి ప్రతిపాదనలు పంపారు. బస్టాండ్ నుంచి ఒయాసిస్ స్కూలు వరకు 3 కిలోమీటర్ల దూరం రోడ్డు విస్తరణకు రెండు విభాగాలకు రూ. 18 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఒకే పనికి రెండు శాఖలకు నిధులు మంజూరయ్యాయి.
- బస్టాండ్ నుంచి ఒయాసిస్ వరకు రూ. 18 కోట్లతో హెచ్‌ఆర్‌డీసీఎల్ పనులను మొదలుపెట్టింది. ఇక ఒయాసిస్ నుంచి నర్కూడ శివారు వరకు ఆర్‌అండ్‌బీ శాఖ పనులను చేపట్టింది. ఇందుకోసం మంజూరైన రూ.18 కోట్ల నిధుల నుంచి కవేలిగూడ వద్ద అర కిలోమీటరు దూరం వరకు సీసీ రోడ్డు నిర్మించారు.

పనుల్లో పురోగతి...

రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. విద్యుత్ స్తంభాలను యుద్ధ ప్రాతిపదికన మార్చుతూ రోడ్డు పనులు వేగంగా జరిగేలా చర్యలు చేపట్టారు. విస్తరణ పనుల కోసం రాళ్లగూడ నుంచి నర్కూడ వరకు ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో ముందుగా ఈ ప్రాంతంలోనే పనులను కొనసాగిస్తున్నారు. బస్టాండ్ నుంచి రాళ్లగూడ వరకు రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగించాల్సి ఉంటుంది. ఇందుకోసం స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతుండగా.. అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రమాదకరంగా వంతెన..

షాబాద్ మార్గంలో కాచారం శివారులో ఎంటేరు వాగుపై ఉన్న వంతెన ఇరుకుగా మారడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన దెబ్బతినడంతో స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి విస్తరణ పనులను రామంజాపూర్ వరకు చేపడితే ట్రాఫిక్ సమస్యపరిష్కారమయినట్లే.